కుటుంబతరంగిణి, ౯ :

# కబ్బన్ పార్కు

[కథానిక]

= శ్రీ కవికొండల వెంకటరావు =

"చైత్రవైశాఖమాసములు వసంతఋతువు" అని చదువుతూవుంది కూతురు, ఎనిమిదితొమ్మిదేళ్ల పిల్ల, తనకు తానై స్వతంత్రించి ఎలెక్ట్రిక్‌దీపం వేసికొని, చావడిలో తండ్రియొక్క కుర్చీమీద కూర్చుని.

వంటింట్లో భోజనం చేస్తూ, వడ్డించి నిలబడ్డ భార్యతో అంటున్నాడు భర్త: "ఈవూళ్లో చైత్రవైశాఖాలు గ్రీష్మఋతువు. వసంతఋతు వని ఎలా వ్రాశాడో ఆ వ్రాసినవాడు?" భార్య "ఊరూరుకీ సరిపడేలాగూ, మనిషిమనిషికీ అక్కఱకొచ్చేలాగూ వ్రాస్తారా ఏమిటి? ఏదో ఆ గ్రంథకర్త సర్వసామాన్యంగా చైత్రవైశాఖాలు వసంతఋతువు అని వ్రాసివుంటాడు. మీ ధోరణి చూస్తే పిల్లిమీదా, ఎలకమీదా వంక పెట్టి ఏలాగో వోలాగు ఈయేడూ వెళ్లి 'వూటీ'లో వుండామనే కాబోసు. నేను వెళ్లనివ్వనునుమండీ! డబ్బుకు డబ్బెత్తు పెటుగు—అన్నీ ప్రియం — అలాంటప్పుడు ఇంకా రైళ్లకు పోసి, పూటకూళ్లకు పోసి, తగలెయ్యండి డబ్బు" అంది. భర్త శాంతంతోనే "ఈ భోజనం డాబామీద ఆరుబయట వెన్నెల్లోనైనా పెట్టవు! ఏలాగు చెప్పు-తినడం-ఈ కూపంలో ఈ తాపంలో?" అన్నాడు కూర కలుపుకుంటూ. భార్య "మీ కేం చెబుతారు—డాబా కడగొద్దుటండీ? తినే ముందు వోమాటు కడగాలి! తిన్నాక మఱోమాటు కడగాలి! ఇంతకూ మీరూ నేనే ఆయిరి విందు కుడిచేవాళ్లం. పిల్ల అది అసురసంధ్య కాకుండానే ఆకలి ఆకలి అంటూ మధ్యాహ్నం వండిన మెతుకులే తింటుంది. ఏయేర్పాట్లు చేసుకున్నా మీకూ నాకేగా? ఇంతకూ పైని పీవన గిఱన తిరుగుతూనేఉందాయిరి.

నేను అనేది ఏమీ లేదు. చక్కఁగా ఇల్లు కట్టుకున్నాం గదా! ఇంటిమీద మేడ వేసికొన్నాంగదా! మేడమీద డాబా లేవదీశాంగదా! ఓ వేసంగైనా ఆ డాబామీద పండువెన్నెట్లో నిండుగా మల్లెపూలు పరుచుకుని పండుకోకూడదా అని" అంది.

"అనితే ఈరేత్రి ప్యాసెంజరుకు ప్రయాణమై వెళ్లొద్దంటావు?"

"సరి, అప్పుడే ప్రయాణముహూర్తంకూడ పెట్టుకునే వచ్చారూ? క్లబ్బునుంచి రావడంలో?"

"ఏం చెయ్యమంటావ్! ఊటీ కాకపోతే బెంగుళూరైనా వెళ్లకతప్పదన్నారు మా మెంబర్లు"

"ఎవ రా మెంబర్లు?"

"మనస్సు వో మెంబరు, హృదయం వో మెంబరు, కాలో మెంబరు, చెయ్యో మెంబరు, నోరు వో మెంబరు, నాలిక వో మెంబరు — నా శరీరమే వో క్లబ్బు! నే ననుకొన్నాక మఱి వెళ్లక మానను. రేపురాత్రి పండ్రెండుగంటలకు ప్రయాణం. నేను తిరిగివచ్చేలోపుగా నీసదుపాయం, నీసాయం, అమ్మాయి కక్కఁవలసిన చదువుసరఫరా అన్నీ నిరభ్యంతరంగా జరగడానికి రెండువందలరూపాయలు ఇచ్చివెడుతూవున్నాను. ఏమగడింతకంటె ఎక్కువ ధారాళంగా వుండగలడూ? ఈలోకంలో? ఈవూరంత దరిద్రపు వూరు ఇదేకాని మఱొకటి వుండదు, వుండబోదు, పూర్వం లేదు. పంచాగ్నిమధ్యమందూ వున్నట్టుగా వుంటుంది పూటపూటకూ వో అగ్ని అంటుకుంటూ. ఉదయాహ్నం, అపరాహ్నం, మధ్యాహ్నం,

సాయాహ్నం, సంధ్యాహ్నం — రాత్రి అందన్ను కూడా ఓఅహన్నే ఈవూళ్లో."

పై సంభాషణ ముగిసేలో భర్త భోజనం సాంతం అయింది. కూతు రప్పటికప్పుడే పుస్తకం మూయకే కుర్చీలో నిదురిస్తూవుంది. భార్య "ఏవీ? ఇస్తానన్న రెండువందల రూపాయలు?" అని అడిగింది. భర్త "భోజనము చేసి తిన్నగా డాబామీదకు రా! అక్కడా చెల్లించడం!" అంటూ మేడెక్కి, మేడ మీదనుంచి ఇంకా పైకి డాబా ఎక్కి ఆకాశంవంక తిలకించేడు. క్రిందను ఇల్లాలు వీథితలుపు వేసికొని, కూతుర్ని సరిగా పరుండబెట్టి, అవీ యివీ సవరించు కుని - ఎంతలో భోజనం కానిచ్చుకుందో - అరగంట లో ఆప్రదేశానికే, అనగా భర్తఉన్న తావుకు చేరు కుంది.

ఎంతలో మబ్బు కమ్మేసిందో ఏమిటో అంతలో తారాపథం దారాలు తెగినట్టు అయి చిన్నబోయింది. ఒక్క చుక్కా కానరాదు. మఱి మెఱపులు ఆరు బయట ఆ ఎత్తున నిలబడితే మెడ లుత్తరించే చంద్ర హాసాల్లా కలవరపెట్టసాగాయి. ఆదాకా నగ్నంగా వుంచుకోవాలని అనిపించే శరీరాలు వొక్కనిమేషంలో ఉన్నిశాలువల్ని కోరుకున్నాయి. వర్ష మేమిటి! ధణ ధణా, ఝుణఝుణా, టపటపా, పటపటా చప్పుడు చేస్తూ కురిసింది. గాలేమిటి! రివ్వున ఓమారు, గంయిని వోమారు వీవసాగింది. వాతావరణం వడగళ్లేపడ్డాయో, మంచుగడ్డలే కూలాయో అన్నంత వణికించివేసింది. ఒకటిరెండు పిడుగులుకూడా పడ్డంత పెటీల్లుశటీల్లు మంది అంతరాళం రెండుమూడుతడవలు మహా ఘోరంగా.

భార్యాభర్తలు దిగిపోయి క్రిందిగదిలో తలు పులు బిడాయించుకుని, ఏ బుఱుకువైందీ గుర్తించ లేని స్థితిలో తెల్లాటి మేలుకొన్నారు. "అమ్మయ్యా! ఏలాగైతేం వాన వెలిసిందే!" అంటూ ఆశ్చర్య పోయారు.

ఆఉదయం భోజనం చేయడంలో భర్త బెంగ కూరుమాట మఱచిపోయాడు. భార్య రెండువందల రూపాయల సంగతీ ఏమఱిలింది. కూతురు "ఎండా కాలం వానలు కురిశాయి ఏమిటే!" అని వోపర్యాయం తన కళ్లు తండ్రికేసీ, ఓపర్యాయం తల్లికేసీ త్రిప్పి— "నాకూ ఆకలేస్తోందే అమ్మా!"అంది."మీ నాన్నగారు ఆకలేసి తినడం లేదు తల్లీ! కాస్సేపు వుండు" అంది తల్లి. "అవునా నాన్నగారూ? మీరు ఆకలేసి అన్నం తినడంలేదూ? అన్నం తినడంలేమూ?" అంది కూతురు తన తండ్రి విస్తట్లోని పదార్థాలు కనిపెడుతూ కాళ్లా డించుకుంటూ.

భర్త—లేదమ్మా! లేదు ! అన్నం తినడంలేదు. నేను ఆకలేసి గడ్డి తింటున్నాను.

భార్య – ఏమిటండీ! అలా అంటారు ! గడ్డి అన్న మాట నానోటంట వచ్చిందా?

కూతురు తల్లిదండ్రుల యిద్దఱి సంభాషణ వైచిత్ర్యం తా నెలా అర్థంచేసికోవాలో బోధపడక— "రాత్రి వాన కప్పుడే పెరట్లో గోడమీద గడ్డి మొలు స్తూం దేవ్ ! అమ్మా! మన గోడమీదే! వాళ్ల గోడ మీద కాదు!" అంటూ ఎదో ఆటాడుకునే దృష్టిని వెళ్లిపోయింది.

తిరిగి సంభాషణకు భార్యాభర్త లిద్దరే మిగిలా రుగాని చెప్పదగ్గ వాక్యం ఒక్కటీ లేదు. క్రితంరాత్రి వర్షపుచలువ ఆమధ్యాహ్నం కాసిన ఎండకే మటుమా యమై మళ్లీ ఎప్పటి ఆశే అన్నంత వేడీ, వేడితో పాటు విసువూ, ఉక్క, ఉక్కతో పాటు వేదనా ఎన్ని బయల్దేరాలో అన్నీ బయల్దేరాయి ఆ దంప తుల మధ్య. కాని వో సుగుణం గుర్తించాలి. భార్య ఒక తీపి, ఒక కారం ఒకటోరకంగా స్వయంగా తయారుచేసి, స్వయంగా పళ్లెంలో సర్ది, తాను ఆపళ్లెం ఓ చేతిలో పెట్టుకుని, రెండోచేత చల్లటి మంచినీళ్ల జోడా తీసికొని, భర్తయొక్క అంతరంగికాలోచనా గారంలోని మేజాబల్లమీద వుంచి "చిత్తగించండి! దయచేసి" అంది. ఆసమయాని కూతురు నిద్దరో తూవుంది ఏమూలో. మఱి ఈలోకంలో జీవనసంచా రం లేదు అంతరిక్ష మార్గాన్ని వెళ్లే ఒకానొక వాయు విమానపు గమనాన్ని తప్పిస్తే.

భర్త—నన్ను తీసికోమనా ?

భార్య—ఊఁ. పిక్క లాక్కుపోతూవుంది, ఈ జోడాబరువుతో.

రైలుజోడా ఆలా తన రెండు అరచేతులూ ఆనేటట్టు పట్టి "ఇంత చల్లటినీళ్లు ఎలా తయారు చేశావు?" అన్నాడు భర్త.

"మీదయవల్ల ఈపూట నాచేతులలో వూటీ చలవ కొంచెం కలిగింది."

"ఆడవాళ్లు తలుచుకుంటే ఎంతకైనా సమర్థురాండ్రు. ఇంత చలవ ఈ నీటి కెలా వచ్చిందో చెప్పవూ? నాకు చెప్పవూ?"

"ఆవల చెప్తాను. ముందు .ఈ తీపి, ఈ కారం తిని ఈ నీళ్లు పుచ్చుకుంటూవుండండి. ఎటువంటి కాఫీ తీసుకొస్తానో!"

అంటూ ఆమె వెనుదిరిగిపోతూవుంటే భర్త, మేజామీదివి ఒక్కటీ పుచ్చుకోకుండానే భార్యవెనకాతలే, వండేచోటికి వెళ్లాడు. భార్య కాఫీ కలుపుతూ "అక్కడ పెట్టినవి సేవించారా, లేదా? అయ్యో! వెళ్లి కూర్చోండి మీచోట మీరు దర్జాగా. నేనో అయ్యర్‌లా అందిచ్చి నావిద్య చూపించాలనుకుంటూవుంటే వచ్చేశారేం?" అంది. "అయ్యరుల్లా మన ఆడవాళ్లుగాని, మన మగవాళ్లుగాని లక్షపుటాలు పెట్టినా కాఫీ తిరగపోసి చల్లార్చలేరు! వాళ్ల సాంబార్! రసం!" అన్నాడు. అంటూ గుటక లేశాడు. "పోనీ లెండి! వండినవి వృథాపోనివ్వకండి. పదండి. తింటూవుండండి. వస్తున్నాను. కాఫీ తీసుకొస్తున్నాను." అంది భార్య.

భర్త—నీతో వో రహస్యం చెప్పాలని వొచ్చాను.

భార్య—ఏమిటది?

ఏదో ఇద్దరూ గుసగుసలాడుకున్నారు. "త్వరగా తయారుకా!" అంటే "ఇదిగో వొక్క క్షణం. పాపాయి! లే!" అంది భార్య.

వాళ్ల అమ్మాయిముద్దుపేరు పాపాయి. పాపాయి అట్టే లేచింది. ముగ్గురూ ఇట్టే తయారయ్యారు.

వాళ్ల గుసగుసలు, గుజగుజలు మరో రకానివేమీ కావు. బెంగుళూరులోనూ, వూటీలోనూ గొప్పయిళ్ల శ్రీమంతులు, అనగా హైక్లాసు సొసైటీ పీపిల్ ఎలా మోటార్ల మీద షికార్లు కొడుతూవుంటారో అలా ఆ సాయంత్రం భార్యనూ, కూతుర్నీ తాను ఆ వున్న వూళ్లో షికారు తీసికొని వెడతానని వాగ్దానం చేశాడు అతి రహస్యంగా పురుషుడు. స్త్రీ అంతకంటె రహస్యంగా "వల్లె" అంది. ఒల్లె కట్టింది. మల్లెలు మొల్లలు, కనకాంబరాలు నీలాంబరాలు, మరువం దవనం—తో జడే ఓఅల్లాడే తీగా అన్నట్టు వేసుకుంది. కిల్లీ నమల్తూ కారెక్కింది. ఆమె ప్రక్కనే కూతురు ఓ ఫ్రాక్ తొడుక్కుని, ఫ్రాక్ మీద వో శంఖాలతావళం వేసికొని, బూట్సు సాక్సు చూచుకొంటూ, ముంగురుల్లో బొంగరాల్లా తిరిగే గులాబీమొగ్గల్ని వుండతోసికుంటూ కూర్చుంది. భర్త ఏమన్నా ఆకు పచ్చంచుల తెల్లని పంచ, అంతకంటె తెల్లని లాల్చీ, లాల్చీకంటె తెల్లనైన కండువా ధరించి, మెత్తని ఆకుజోళ్లు తొడుక్కుని, అప్పుడే గీసుకొని కడుక్కొన్న గడ్డం నునుపు రాచుకొంటూ చిన్నపిల్ల ప్రక్కనే కూర్చున్నాడు. డ్రైవరుసీటులో డ్రైవరున్నాడు. డ్రైవరు పక్కసీటు పూర్తిగా ఖాళీ! అంత ఖాళీగా వున్నా ఎవరుపడితే వాళ్లు ఎక్కడానికి వీల్లేదు. వెడుతూన్నవారు ప్రత్యేకించి వో కుటుంబం!

వారోరోడ్డంట కారు వూపున చూపున వెడుతూవున్నారు. "కన్నారుటండీ ఎంత వింతగా వున్నాయో ఈ చెట్లు!" అంది భార్య. భర్త ఆమె చూపించే వ్రేలివంకనే ప్రతీచెట్టూ, ప్రతీ తీగా, ప్రతీ మేఘం, ప్రతీ కిరణం చూచాడు. అతని కదేమిటో ఆ సాయంకాలం అదివఱ కెప్పుడూ కనిపించని అందం, ఆనందం ఆవూళ్లో కనిపించినాయి. "కమ్మకమ్మని తెమ్మెరలు వీస్తున్నాయికూడాను." అన్నాడు. "జుమ్మ జుమ్మను తుమ్మెదల రొద విన్నారా?" అంది భార్య. కూతురు రెండు వర్ణనలూ అతికి

"కమ్మకమ్మ తెమ్మెరలు
జుమ్మజుమ్మ తుమ్మెదలు"

అని ఏకవర్ణంగా పాడుతూ "ఇంకా గబగబా పోనియ్యవోయి కారు, డ్రైవరూ?" అంటూ ప్రోత్సహిస్తూవుంది.

ఎవరికైనా చూడ ముచ్చటేసే రస్తాగా తట్టక మానదు ఆ సంధ్యా సమయాన్ని ఆ రస్తా. అది మామూలు రస్తా కానేకాదు అని అనుకోవాలి. ఏమైపోయాయో ఆకులు ఆ దేవగన్నేరువి? ఆకులన్నీ ఎగిరిపోయాయి! చెట్టంతా తెల్లని పువ్వే! మఱి దిరిసెన చెట్టు ప్రతీ రెమ్మచివరా ఓ ఎఱ్ఱని పూవుకుచ్చే! ఆ ప్రక్కనే వున్న రావిచెట్టునిండా లేలేత నిశ్శబ్దపు టిగురే! ఇంకోతట్టు బూరుగుచెట్టు కేవలం కాయలతో—వేలకొద్ది కాయలతో! ఆకుల్లేని పూవుల్లేని సొబగుతో పిల్లల ఆటవస్తువుల్లా కనిపిస్తూ వున్నాయి. దాని కెదూరుగా పావురాల చెట్లు—వెండి మలామా చేసినంత రంగుతో వున్న కొమ్మల్ని గిర్రుగిర్రు కాయలు రాల్చి త్రిప్పుతూ వున్నాయి. వేప చెట్టున పువ్వు, చిన్నిచిన్ని పిందె! ఎటుచూచినా వింత వింతవన్నె, వింతవింత తావి, వింతవింత విసురు చూపని చెట్టే లేదు ఆ మార్గాన్ని! తీగలమాట అటు వుంచండి! మల్లెలు, సన్నజాజులు, మాలతి ఇల్లాంటి లతల మాట అట్లా వుంచండి!

“మనం వెడుతూవున్నది వూరా, నందన వనమా?” అంది భార్య. భర్త “వసంతకాలం యొక్క ప్రభావం!” అన్నాడు. “ఏలాంటి చక్కని మార్పు చూపిస్తున్నాయండీ ప్రతీమొలకా, ప్రతీమాకూ” అంది భార్య. భర్త “నాకూ ఆలాగే తోస్తూవుంది. ఈలా ఆకుల్లేకుండా చెట్లను కేవలం పువ్వు లుండడం - ఈలా గాలి లేకుండా పువ్వులు చక్కని సువాసన మనమీద కొట్టడం - ఇదే తొలిసారి ఈవూళ్లో నేను కనుగోడం!” అన్నాడు. భార్య “ఇంకా ఇంకా ఏయే వింత వింత సేతలు చేసివుందో ఈ వసంతం! ఈ నవవసంతం! ఈమధువసంతం!” అంటూ కూతురి తలకంటె ఎత్తుగా తన మెడ నిక్కించి ఆలా భర్తను అదోతీరుగా చూచింది. భర్త ఏదో పరధ్యానతత్పరుడై “అదెవరంటావు? అలా అడ్డదారిని నడచి వెడుతూవున్నది?—అది మనదగ్గఱ, కడచిన శీతాకాలంలో పనికుదిరిన ‘కోకిల’ అనేవాళ్లం ఆపిల్ల కాదూ?” అని అడిగాడు. “అవునండీ! అదే అదే! ఏడాదిలో ఎంత ఎత్తు ఎదిగింది! మనదగ్గఱున్నప్పుడు నల్లగా వుండేదా?—ఇప్పుడేమిటి? ఎక్కడ లేని నిగారింపూ కాపరస్తూ వుంది!—ఆఁ - చెవుల్ని లోలాకు లూగిస్తూందే! ఏమి చిత్రం! చెట్టుకూ చేమకూ వచ్చినట్టు దానికీ మార్పు వచ్చిం దనుకుంటాను. పిలిచి చూస్తాను. పలుకుతుందో, ఏంచేస్తుందో?”అని కార్లోనుంచే “కోకిలా! వోనేవ్! కోకిలా!” అంది. తల్లితోపాటు కూతురుకూడా “కోకిలా! కూఁకూఁ—కోకిలా!” అని అఱచింది. “డ్రైవర్, కారు ఆపవోయి వోసారి!” అన్నాడు భర్త.

‘కోకిల’ అని వారిచే పిలవబడ్డ ఆవింత కుఱ్ఱది వెనక్కు తన నడకనే తిరుగుతూ తిన్నగా ఆగిన కారు దగ్గఱకు వచ్చి నిలబడి, కారుయొక్క ద్వారంమూత నేర్పడ్డ కిటికీగుండా అమ్మగార్కి, అయ్యగార్కి నమస్కారం పెట్టింది.

భార్యాభర్త లిద్దఱూ, వాళ్లిద్దఱికంటే విస్తారంగా వాళ్ల చిన్నపిల్లా, చిన్నపిల్లకంటే అతివిచిత్రంగా డ్రైవరూ ఆయువతిని ఓక్షణం విలోకించి “ఇంతకూ నవమధువసంతం అంతా నీలో వున్నదే” అన్నట్టు చూగవోయారు. ఆ యువతే “అమ్మగారూ! అయ్యగారూ! క్షేమంగా వున్నారా? అమ్మాయిగారూ తమరూ?” అంటూ భార్యాభర్తల మధ్యను వున్న చిన్న పిల్లను ఓసారి తన చేతు లలా చాచి ఆదరించింది. యువతి రెండుచేతులయొక్క మణికట్లనూ కంకణాలు ఘల్లుమన్నాయి. కంకణాలు తప్పిస్తే మరి బుజాలదిగులోతుద్దాకా ఆభరణాల్లేవు, ఆచ్ఛాదనలూ లేవు. పయ్యెత్తు పయ్యెత్తుగానే వుంచుకుని చెక్కు చెదరని చాయనే కిటికీక్రింది అంచుని ఆని, అదో ఆధారాన్ని ముందుకు ఆయువతి వంగగలిగిం దని మనం అనుకోవాలి! ఏలా నిలబడ్డావే అని ఎవరూ అడగనూ లేదు. ఆసమయంలో - లేకపోయినవాటిని గురించి లేవేమే అని ఆరా తీసినవారూ లేరు.

అడిగిన ప్రశ్న అల్లా “నీ మొగు డెక్కడున్నాడే ఇప్పుడు? ఎప్పుడు వెళ్లడం అడికాడికి నువ్వు?” అని అడిగింది ఇల్లాలు. యువతి కొంచెం సిగ్గుపడుతూ “ఎక్కడున్నదీ, ఎప్పుడు వెళ్లేదీ అమ్మగారి కంతా యీ వుత్తరం సెప్పుద్ది. మీదయవల్ల వో అక్షర

మ్మొక్క నేర్చుకున్నాను. ఆడి కోవుత్తరం రాయగల్గుతున్నాను. ఆడి సిపాయిద్వారా తెలిసికోగలుగుతున్నాను. కాని అమ్మగారూ! ఇదేంటో బోధపడ్డాది కాదు తల్లీ! యీముక్క సూడండి!" అని ఓజాబు తన రొంటినుంచి తీసి విప్పి తన మునుపటి యజమానురాలి చేతి కిచ్చింది. ఆమె-ఆయిల్లాలు "నీవు ఇప్పుడు వొక్కత్తివే కామోను. ఆలా ముందుసీటులో కూర్చో మాయింటి దాకా వద్దుగాని." అంది. డ్రైవరు కొంచెం సదురుకున్నాడు చోటిచ్చేలా. యువతి "ఎందుకులెండి. నే నీమాపటిరైల్లో బెంగుళూరు వెడుతున్నాను. మఱి టైము లేదు మీయింటికి రావడానికి. అక్కడ ఆమాటేమిటో బోధపడలేదు. ఆపార్కులో వాడూ, నేనూ రోజూ మకాంగా షికారు కొట్టొచ్చునంట! ఈగాజు లాడంపినవే"

"ఈలోలాకులు?"

"ఆడివే!"

"మఱి నీయేంటి?" అని ప్రకృతి ప్రశ్నించింది వెంటవెంటనే. కాని ఆయువతి ఓ చిరునవ్వునవ్వుతూ ప్రకృతిని వినిపించుకోనట్టు "ఆయేనండి! ఆ అచ్చరాలేనండి!" అంటూ, అయ్యగార్ని తెలిసికోండి అన్నట్లు పలుకు కొసరింది. ఆపలుకు వెలికిరాకుండానే భర్త భార్యచేతిలోని వుత్తరంలోకి తొంగిచూస్తూ "కబ్బన్ పార్కు! కబ్బన్! కబ్బన్!" అన్నాడు. భార్య "బెంగుళూరులోనిదేనా కబ్బన్ పార్కు? మీరు చూచారా?" అంది భర్తతో, ఉత్తరం ఆలా యువతి కిచ్చివేస్తూ. "ఆః. బెంగుళూరులోదే. లక్షసారులు చూచాను. మళ్లీ మళ్లీ చూడాలనేగా ఈరేత్రి బయలుదేఱి నేను వెడతానని నీతో అన్నది? గాలీ వానా వచ్చి మన కథ అంతా ఆపుచేసిందిగాని." అన్నాడు ఆయన. అప్పటికప్పుడే యువతి ఆరుగజాల మేర రెండంగల్లో తప్పుకుంది. కారు గంటకు ముప్ఫైమైళ్ల వేగంతో ఇంటివైపు మళ్లు మొగం పట్టింది.

"మన యిద్దఱికీ, మన చిట్టితల్లికీ ఆ బెంగుళూరులో రెండువందలు ఓ నెలకు సరిపోతాయా అంటే బయల్దేఱండి — వెడదాం — ఈరాత్రే! నా అభ్యంతరం లేదు! ఇక్కడ ఎండలు ఎంతమాత్రం భరించలేం" అని వో తీర్మానానకు వచ్చేసింది భార్య, కారు దిగుతూ. కారు దిగుతూ భార్యతో భర్త, ఆ యిద్దఱితో వారి కూతురూ. కాని ముగ్గురూ కూడా ఇంటిమెట్లెక్కాక "రెండువందలు సరిపోతాయా, రెండువేలు సరిపోతాయా?" అనేది ఆరాత్రి తెల్లవార్లూ బడ్జెట్టు వేసినా తెగలేదు.

కోకిల మూడోనాటి సాయంత్రాని కప్పుడే ఏబడ్జెట్టూ వేసికోకుండా చేరి 'కబ్బన్ పార్కు'లో కదంబవృక్షంకింద తన కాంతునితో సరదాగా లాడుకుంటూ "కూఊః" అంటే "కూఊః" అంటూవుంది.